డబుల్ ఓటర్లలో గుబులు!

-ఒకటి ఊర్లో..మరొకటి పట్నంలో
-గ్రేటర్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ
-ఎన్యూమరేషన్ ఫామ్స్ అందజేస్తున్న బిఎల్‌వోలు
-తమ ఓటు ఉంటుందో..లేదోనన్న ఆందోళనలో వలస ఓటర్లు

హైదరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైంది. బిఎల్ఎల్‌వోలు ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తున్నారు. తాజాగా గురువారం జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్,జోనల్ కమిషనర్ బి. సంతోష్‌లు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఫిల్మ్ నగర్, జ్ఞాని జైల్ సింగ్ నగర్‌లో ఎన్యూమరేషన్ ఫాం పంపిణీని పరిశీలించి ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. ఎస్ఆర్‌వోలు తప్పులు దొర్లకుండా చూసుకోవాలని బిఎల్‌వోలకు సూచించారు. అయితే ఓటర్ల జాబితాలో డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, అనర్హుల ఓట్లు తొలగించడం కోసం ఉద్దేశించిన ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కొరవడింది. బూత్ లెవల్ అధికారుల నిబద్ధత పైనే మొత్తం ప్రక్రియ ఆధారపడి ఉందని తెలుస్తంది. ముందుగా బీఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తే ఓటర్లు వాటిలో వివరాలను పూరించిన తర్వాత బీఎల్‌వోలు సేకరిస్తారు. మొదట ముసాయిదా జాబితా, తర్వాత తుది జాబితాలో ప్రచురిస్తారు. అయితే హైదరాబాద్ ప్రధానంగా వలసలకు కేరాఫ్ అడ్రస్.. ఇక్కడ ఇతర రాష్ట్రాల వారితోపాటు తెలంగాణలోని ఇతర జిల్లాల ప్రజలు సైతం జీవిస్తున్నారు. కొందరు శాశ్వత ప్రాతిపదికన ఉంటున్నప్పటికీ.. సొంత ఊరిలో పొలం ఉండటమో లేదా బంధువులు, ఇల్లు ఉండటంతో ఇక్కడ, అక్కడ ఓటర్లుగానే కొనసాగుతున్నారు. వలస ఓటర్లకు రేషన్ కార్డు, ఓటర్ కార్డు రూపంలో పుట్టిన ఊరితో సంబంధాలు ఉంటున్నాయి. ఇప్పుడు ఆ ఓట్లు తొలగిపోయే అవకాశం ఉంది. అలాగే ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల్లో సెటిల్ అయిన వారు కేవలం ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇక్కడికి వచ్చి ఫారాలను సమర్పించే అవకాశం లేదు. దీంతో వారంతా అనర్హులుగా మారుతారనే ఆందోళన నెలకొంది.

ఫిలింనగర్‌లో బిఎల్‌వోలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫాంలు పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

గార్డియన్ పేరు లేకుంటే ఎలా ..?

ఇతర ప్రాంతాలకు వలస పోయిన వారే కాకుండా, ఇతర రాష్ట్రల నుంచి వలస వచ్చిన వారు కూడా తమ ఓటు హక్కును ఇక్కడ వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వారు కూడా ఎస్ఐఆర్2002 జాబితాలో వారి సంబంధీకుల పేర్లు ఉండవు కాబట్టి ఎలా నిరూపించుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు. తల్లిదండ్రులు జీవించి ఉన్నవారికి పెద్దగా ఇబ్బంది లేకపోయిన ప్పటికీ, మరణించిన వారి విషయంలో కొంత అయోమయం ఏర్పడుతోంది. గార్డియన్ సంరక్షణలో పెరిగిన వారు తమ తల్లిదండ్రుల పేర్లుగా ఎవరివి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది. గార్డియన్‌గా ఉన్నవారి పేర్లు ఎస్ఐఆర్ 2002లో లేకుంటే ఏం చేయాలనే విషయంలో కూడా కొంత సందిగ్ధం ఉంది. అలాగే 2002 తర్వాత వివాహం చేసుకుని అత్తవారింటికి వచ్చిన వారు ఇప్పుడు ఎస్ఐఆర్‌లో తల్లిదండ్రుల వివరాలు నమోదు చేయాలా? లేక అత్తమామలకు సంబంధించిన వివరాలు నమోదు చేయాలా? అనే విషయంపై కూడా కొంత అయోమయం ఉంది.

బిఎల్‌వో మీ ఇంటికి వస్తే..

బీఎల్ఎలు ప్రతి ఇంటికీ రెండు ఎన్యుమరేషన్ ఫారంలతో వస్తారు. ఒక కాపీని తమ వద్ద ఉంచుకుని, మరొకటి కాపీని ఓటరుకు అందజేస్తారు. ఒకవేళ బిఎల్‌వో వచ్చే సమయానికి ఇంట్లో ఓటరు అందుబాటులో లేకపోతే, కుటుంబంలోని ఎవరున్నా ఆఫారం పూర్తి చేసి సంతకం చేయవచ్చు. ఈ ప్రక్రియలో బిఎల్‌వోలు కనీసం 3 సార్లు ప్రతి ఇంటిని సందర్శిస్తారు.

ఓటరు జాబితాలో పాత లేదా తప్పు ఫొటో ఉంటే, ఫారంలోని నిర్దేశిత స్థలంలో కొత్త పాస్‌పోర్ట్ సైజు ఫొటోను అతికించి సరిచేసుకోవచ్చు. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు తమ పేరు నమోదు కోసం ఫారం6 ను పూర్తి డిక్లరేషన్‌కు బీఎల్‌వోలకు సమర్పించాలి. మరో ప్రాంతానికి మారిన వారు జూలై 31న ముసాయిదా జాబితా వచ్చిన తర్వాత ఫారం 8 ద్వారా చిరునామా అప్డేట్ చేసుకోవచ్చు.

సాధారణ ఎన్యుమరేషన్‌లో ఎలాంటి పత్రాలు అవసరం లేదు.కానీ ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ఓటరు అర్హతపై ఎన్నికల నమోదు అధికారికి అనుమానం వస్తే నోటీసు జారీ చేస్తారు. అప్పుడు తన అర్హతను నిరూపించుకోవడానికి పత్రాల్లోఏదైనా ఒకటి సమర్పించాలి.

హైదరాబాద్ వార్త

రూ.107 కోట్లతో మరో 4 చెరువుల పునరుద్ధరణ

-వరదనీరు సాఫీగా వచ్చిపోయేలా ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లు
-చెరువు చుట్టూ పాత్‌వేలు, ఓపెన్‌జిమ్, ప్లేఏరియా నిర్మాణం
-పనులు ప్రారంభించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

పూజచేసి పనులను ప్రారంభిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, జూన్ 25,ప్రభాతవార్త: వరదల కట్టడితో పాటు.. భూగర్భ జలాలను పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టిన చెరువుల పునరుద్ధరణలో మరో 4 చెరువుల పనులకు హైడ్రా గురువారం శ్రీకారం చుట్టింది. ఐటీ కారిడార్‌కు చేరువలోని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం ఇబ్రహీంబాగ్‌లోని ఇబ్రహీం పెద్ద చెరువు, గండిపేట మండలం, పుప్పాలగూడలోని భగీరథమ్మ చెరువు, కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని కాముని చెరువుతో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రాలోని కాప్రా చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రారంభించారు. ఇబ్రహీం చెరువుతో పాటు.. కాముని చెరువుల వద్ద హైడ్రా కమిషనర్ భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. చెరువు అభివృద్ధితో మురుగు సమస్యతో పాటు.. దోమల బెడద తప్పించడమే కాకుండా.. ఈ ప్రాంతాలు ఆహ్లాదంగా మారుస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాముని చెరువును 48 ఎకరాలు, ఇబ్రహీం పెద్దచెరువు 97 ఎకరాలు, 54 ఎకరాల్లో భగీరథమ్మ చెరువు, 112 ఎకరాల్లో కాప్రా చెరువును అభివృద్ధి చేస్తున్నారు. ఈ నాలుగు చెరువుల పునరుద్ధరణకు రూ. 107 కోట్లు వెచ్చిస్తున్నారు. వరద కట్టడికి వీలుగా చెరువులు..చెరువుల్లో పూడికను మొత్తం తొలగించి.. దుర్గంధం పోయేలా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. వరదల కట్టడితో పాటు.. భూగర్భ జలాలు పెంపుదల లక్ష్యంగా చెరువులను అభివృద్ధి చేయాలన్నారు. పర్యావరణహితమైన వాతావరణం ఏర్పడాలని ఆకాంక్షించారు. చెరువులోకి వరద నీరు సాఫీగా వచ్చేలా ఇన్‌లెట్లు, బయటకు వెళ్లేలా ఔట్‌లెట్లు అభివృద్ధి చేయాలన్నారు. మొదటి విడత అభివృద్ధి చేసిన 6 చెరువుల మాదిరే రెండో విడత చేపట్టిన 14 చెరువులను తీర్చిదిద్దాలని.. ఎక్కడా రాజీ పడకుండా చేయాలన్నారు. చెరువుచుట్టూ పాత్‌వేలు, అన్ని వయసులవారూ సేదదీరేలా ఏర్పట్లు చేయడంతో పాటు.. ఓపెన్ జిమ్‌లు, పిల్లల ప్లే ఏరియాలు ఇలా ఒక పర్యాటక కేంద్రం గా మార్చాలన్నారు. పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ ద్వరా బోటింగ్ వ్యవస్థ కూడా అందుబాటు లోకి వచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలకు రూపొంది స్తోందన్నారు. చెరువుల అభివృద్ధిలో స్థానికులు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. అభివృద్ధి పనులు బాగా జరిగేలా సహక రించాలన్నారు.

అమర్యాదగా నడుచుకుంటే ఊరుకోం: సజ్జనార్

హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త

పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరుపై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారాహితంగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.“కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?“ అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు

కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది .ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు. అక్కడ సిబ్బంది స్పందించిన తీరు, వారికి ఎదురైన అనుభవాలపై నివేదిక తెప్పించుకున్నారు.ఈ రహస్య ఆపరేషన్‌లో దాదాపు 12 పోలీస్ స్టేషన్లలో సిబ్బంది తీరు దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వారితో రిసెప్షనిస్టులు, ఏఎస్సైలు కఠినంగా మాట్లాడటం, అది తమ పరిధిలోకి రాదంటూ పక్క స్టేషన్లకు నెట్టేయడం, సూటిపోటి మాటలతో వేధించడం వంటివి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. అంతే కాకుండా, ఫిర్యాదును వెంటనే స్వీకరించకుండా 'రేపు రా.. మాపు రా' అంటూ బాధితులను రోజుల తరబడి తిప్పించుకున్నట్లు స్పష్టమైంది.ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సజ్జనార్ భావోద్వేగంగా మాట్లాడారు. “మీ కుటుంబ సభ్యులే ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు, అక్కడ ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులే ఎదురైతే మీరెలా భావిస్తారో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోండి“ అని హితవు పలికారు. ఇకపై ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని ఆయన గట్టిగా హెచ్చరించారు.

భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

-నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలి -చాకలి ఐలమ్మ యూనివర్సిటీ పరిశీలనలో కలెక్టర్ ప్రియాంక

హైదరాబాద్,జూన్25,ప్రభాతవార్త: నిర్మాణ దశలో ఉన్న భవనాలను వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశించిన సమయం నాటికి అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న హాస్టల్ బ్లాక్, ఎకాడమిక్ బ్లాక్, ఆడిటోరియం బ్లాక్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, విసి రూమ్ అలాగే వసతి గృహం పనులను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును నిర్దేశిత గడువులోగా పూర్తిచేసేలా పనులను వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు. పనుల పురోగతి, నిర్మాణ విధానం, కూలీల వినియోగం, వివిధ నిర్మాణ విభాగాల అమలు స్థితిని కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. నిర్మాణ వేగాన్ని గణనీయంగా పెంచేందుకు షిఫ్టుల వారీగా ఇరవై నాలుగు గంటలూ పనులు నిర్వహించాలని, అదే సమయంలో నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక నిర్మాణ విధానాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. చట్టపరమైన అనుమతులు, విశ్వవిద్యాలయ పరీక్షలు, వేసవి తీవ్రత వంటి కారణాలతో పనుల్లో కాస్త జాప్యం ఏర్పడిందని

అధికారులతో కలిసి నిర్మాణపనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వివరించారు. ఇకపై నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేస్తూ, అన్ని నిర్మాణ పనులను సమన్వయంతో ఏకకాలంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం రూ.540 కోట్లతో ఈ ప్రతిష్టాత్మక పునర్వికాస ప్రాజెక్టును చేపట్టిందన్నారు. భవనాల నిర్మాణం, దీర్ఘకాలిక స్థిరత్వంపై ఇంజినీర్లను వివరాలు అడిగి తెలుసుకొని, ప్రాజెక్టు అమలులో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.పునర్వికాస పనుల కోసం పాత హాస్టళ్లను తొలగించిన అనంతరం విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఎయిర్ కండీషన్డ్ పోర్టబుల్ క్యాబిన్లను కూడా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. పారిశుద్ధం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి, నిర్మాణ కాలంలో విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు, జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించి, వారికి అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించి వారితో పాటు కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనిత సింగ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుభాస్, నాంపల్లి తహసీల్దార్ నయీముద్దీన్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్ ఇంజినీర్ శ్రీనివాస్, కళాశాల ప్రొఫెసర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

గాంధీ మెడికల్ కాలేజీలో జెనరిక్స్ ఫర్ ఆల్ సదస్సు

సికింద్రాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: పేద, మధ్యతరగతి వర్గాలకు నాణ్యమైన మందులను చౌకగా అందించడమే లక్ష్యంగా సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో జెనరిక్స్ ఫర్ ఆల్ సదస్సు విజయవంతంగా జరిగింది. వారధి ట్రస్ట్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ సదస్సులో వైద్య రంగ ప్రముఖులు, ఫార్మా నిపుణులు, విధాన నిర్ణేతలు, వైద్య విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెనరిక్ మందులపై ప్రజల్లో అవగాహన, విశ్వసనీయత పెంచడం ద్వారా రోగుల జేబులకు భారాన్ని తగ్గించవ చ్చని సదస్సు అభిప్రాయపడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఇందిర, ఎం. ఆనందం అండ్ కో డైరెక్టర్ ఎం. రవీంద్ర విక్రమ్ ప్రసంగిస్తూ.. వైద్యం అనేది కొద్దిమందికే పరిమితం కాకుండా అందరికీ అందుబాటులో ఉండే ప్రాథమిక హక్కు కావాలని స్పష్టం చేశారు. వైద్య విద్యార్థులు, కాబోయే వైద్యులు జెనరిక్ మందుల నాణ్యత, వాటి ప్రాధాన్యతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, రోగుల సంక్షేమం కోసం జెనరిక్ ప్రిస్క్రిప్షన్లను ప్రోత్సహించాలని వారు పిలుపునిచ్చారు.సదస్సులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ సీఈఓ దీపక్ సప్రా, నేషనల్ మెడికల్ కమిషన్ సభ్యులు డాక్టర్ సంతోష్ కుమార్ క్రలేటి, ప్రముఖ ఫార్మా రంగ నిపుణులు వరుణ్ విహార్, శివకుమార్ బాలకృష్ణన్, గాంధీ జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ జలగం తిరుపతిరావు, యశోద హాస్పిటల్ ఆంకాలజీ హెచ్ ఓ డి ప్రొఫెసర్ సుధా సిన్హా పాల్గొని జెనరిక్ మందుల సమర్థతపై సుదీర్ఘంగా చర్చించారు. దేశవ్యాప్తంగా జన్ ఔషధి కేంద్రాలను మరింతగా విస్తరించాలని, జెనరిక్ మందుల వాడకాన్ని తప్పనిసరి చేసేలా తగిన పాలసీలు తీసుకురావాలని నిపుణులు సూచించారు. వారధి ట్రస్ట్ చైర్మన్ కట్టమూరి సుబ్బారావు మాట్లాడుతూ.. తెలంగాణ ఆరోగ్య శాఖ సహకారంతో ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులలో ఖివారధి జెనరిక్ అవుట్ లెట్లనుఖి ఏర్పాటు చేయడానికి తమ సంస్థ సిద్ధంగా ఉందని, భవిష్యత్తులో ఇలాంటి అవగాహన సదస్సులు మరిన్ని నిర్వహిస్తామని ప్రకటించారు.

సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ప్రముఖులు

సూర్యకిరణ్ కాంప్లెక్సులో అగ్ని ప్రమాదం..తప్పిన ముప్పు

బేగంపేట జూన్ 25,ప్రభాతవార్త

సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్సు పక్కనే ఉన్న సూర్యకిరణ్ కాంప్లెక్సులో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది.కాంప్లెక్సులోని మొదటి అంతస్తులో గురువారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.వ్యాక్స్ కన్సల్టింగ్ సొల్యూషన్స్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.కార్యాలయంలో దేవుడికి పెట్టిన దీపం ద్వారా వైర్లకు అంటుకుని షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలియజేసారు. స్థానికుల నుంచి సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.భవనంలో పెద్ద ఎత్తున పొగలు అలముకోవడంతో సహాయక చర్యలకు కొంతసేపు అంతరాయం కల్గింది.పొగలు తగ్గిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు.అగ్ని ప్రమాద సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది.అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నేడు బీబీ కా ఆలమ్ ఊరేగింపు

పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జూన్ 25 ప్రభాతవార్త

పవిత్ర మొహర్రం మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాతబస్తీలో ప్రతిష్టాత్మక 'బీబీ కా ఆలమ్' ఊరేగింపు జరగనుంది.ఈ నేపథ్యంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నగర ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధించారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని అధికారులు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ప్రధాన ట్రాఫిక్ మళ్లింపులు ఇవే..

బీబీ కా ఆలమ్ ఊరేగింపు సాగే మార్గాలను బట్టి ఆయా సమయాలు, ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించనున్నారు. బీబీ కా అలవా, ఏతేబార్ చౌక్ మార్గాల్లోకి వాహనాలను అనుమతించరు. ట్రాఫిక్‌ను సునారగల్లీ టీ జంక్షన్ వద్ద దబీరురా వైపు, ఏతేబార్ చౌక్ వద్ద కోట్లా అలీజా లేదా పురానీ హవేలీ వైపు మళ్లిస్తారు. చార్మినార్, గుల్జార్ హౌజ్, మదీనా చౌరస్తాల వైపు వాహనాలకు ప్రవేశం లేదు. ఈ ట్రాఫిక్‌ను మిట్టీ కా షేర్, ఘన్సీ బజార్, సిటీ కాలేజ్ వైపు మళ్లిస్తారు. గంగానగర్ నాలా, బీబీ బజార్, పురానీ హవేలీ, మొఘలురా వైపు నుంచి వచ్చే వాహనాలను చత్తాబజార్, పారిస్ కేఫ్ లేదా తలాబ్ కట్ట వైపు పంపుతారు. సాలార్ జంగ్ మ్యూజియం, శివాజీ బ్రిడ్జ్ వైపు వాహనాలను అనుమతించరు. చాదర్‌ఘాట్ రోటరీ మీదుగా వచ్చే వాహనాలను కోఠి లేదా రంగమహల్ వైపు, నయాపూల్ వద్ద ట్రాఫిక్‌ను మదీనా వైపు మళ్లిస్తారు. షేక్ ఫైజ్ కమాన్, హాఫెజ్ దంకా మసీదు, జబ్బార్ హోటల్ వద్ద, అలాగే హాఫెజ్ దంకా మసీదు వద్ద వాహనాలను ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లోకి పంపుతారు. ఆర్టీసీ బస్సులపై ఆంక్షలు.. టీజీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ జిల్లా బస్సులను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రంగమహల్, అఫ్జల్‌గంజ్ వైపునకు మళ్లిస్తారు. ఊరేగింపు ముగిసే వరకు కాళీఖబర్-మీరాలం మండి రోడ్డుపైకి బస్సులకు ప్రవేశం ఉండదు. నగర పౌరులు, వాహనదారులు ఈ ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని, గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ విభాగం సూచించింది.

వర్షాకాలానికి ఎంఎంసి సిద్ధం.. 24 గంటలు అందుబాటులో సిబ్బంది

-ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త

వర్షాకాలానికి ఎంఎంసి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి, కానాజీగూడ, ద్వారకానగర్ కాలనీ, టెంపుల్ ఆల్వాల్ రోడ్, మచ్చ బొల్లారం రోడ్ ప్రాంతాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. మొదట ఓల్డ్ బోయిన్ పల్లిలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, వరద నీటి కాలువలు, ఓపెన్ నాలాలు, డ్రైనేజీ అనుసంధానం, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను కమిషనర్ పరిశీలించారు. నాలాలు మరియు స్టార్మ్ వాటర్ డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులను క్రమం తప్పకుండా చేపట్టి వర్షపు నీరు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, కాలనీల్లో నీరు నిల్వ కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే కానాజీగూడలో ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థను పరిశీలించిన కమిషనర్, ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది లేదా సాట్ ఆటో డ్రైవర్లు గైర్హాజరైన సందర్భాల్లో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించి సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. ద్వారకానగర్ కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని అక్రమంగా చెత్త డంపింగ్ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్, వెంటనే చెత్తను తొలగించి బాధ్యులపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. అక్రమ డంపింగ్‌ను పూర్తిగా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. టెంపుల్ ఆల్వాల్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న, వినియోగంలో లేని కేబుల్ వైర్లు ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తించి, సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకుని వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. మచ్చ బొల్లారం రోడ్డులో నీటి సహజ ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ఆక్రమణలను గుర్తించిన కమిషనర్, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వర్షపు నీరు సాఫీగా నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ వ్యవస్థలోకి వెళ్లేలా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల భద్రత, పారిశుద్ధం, నీటి పారుదల వ్యవస్థ నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం పకడ్బందీగా అమలు

డిఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్

హైదరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త: క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు నియమ నిబంధనలు పాటించాలి అని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ఈమేరకు గురువారం కిమ్స్ ఆడిటోరియంలో ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తెలంగాణ క్యాన్సర్ పోర్టల్ పై ఓరియంటేషన్ శిక్షణ నిర్వహించారు. అలాగే నోటిఫై చేయబడిన వ్యాధుల నివేదికలపై సమగ్రంగా వివరించారు. అన్ని అల్ట్రాసౌండ్ కేంద్రాలు, మరియు డయాగ్నొస్టిక్ సెంటర్స్ పిసిఅండ్ పిఎన్ డి టి చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు నిర్ధారణ చేయబడిన ప్రతి క్యాన్సర్ రోగిని పోర్టల్‌లో నమోదు చేసి నివేదించడం తప్పనిసరి అన్నారు. క్

గొప్ప నాయకుడు మాగంటి : కెటిఆర్

దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ దినోత్సవంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

యూసుఫ్‌గూడ, 25 జూన్, ప్రభాతవార్త : ప్రజల మన్ననలు పొందిన గొప్ప నాయకుడు దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం యూసుఫ్‌గూడ పోలీస్ లైన్‌లోని శౌర్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాగంటి గోపినాథ్ కుటుంబసభ్యులను పలకరించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాగంటి సతీమణి మాగంటి సునీతా గోపినాథ్, కుమారుడు వాత్సల్యనాథ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ వాణిశ్రీ, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు షఫీ, దేదిప్య విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ పటేల్, బీజేపీ నాయకులు కీర్తిరెడ్డి, మహిళా నాయకురాళ్లు లూర్దుమేరీ, స్వాతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన గద్వాల్ విజయలక్ష్మి

మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన గద్వాల్ విజయలక్ష్మి

జూబ్లీహిల్స్, జూన్ 25, ప్రభాతవార్తః బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మహిళా భవనంలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద అర్హులైన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి, వ్యాపార రంగాల్లో మరింత పురోగతి సాధించాలని, వారి అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కు,ఉనికి కాపాడేందుకు కృషి : డా.కోట నీలిమ

బేగంపేట జూన్ 25.ప్రభాతవార్త

ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కు మాత్రమే కాకుండా ,వారి సామాజిక ఉనికికి ,గుర్తింపుకు ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డా.కోట నీలిమ అన్నారు. ఒక్క అర్హత కలిగిన ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ఎవరి ఓటు హక్కు కూడా కోల్పోకుండా ఉండేలా సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పనిచేస్తున్నారని నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలలా కాంగ్రెస్ పార్టీ అప్రమత్తంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రిలో అవగాహన సదస్సు

అప్జల్‌గంజ్,జూన్ 25ప్రభాతవార్త: బొల్లి మచ్చలపై ప్రజలు బయపడాల్సిన అవసరం లేదని, అవమానం నుంచి ఆత్మవిశ్వాసం వైపు నడువాలని డెర్మాటాలజీ, వెనిరియాలజీ లెప్రాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ కటకం భూమేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ బొల్లి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా మెడికల్, ఆసుపత్రి, డెర్మాటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ విభాగంలో ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోగుల పరీక్షలు, కౌన్సిలింగ్, సెషన్లు, బొల్లి గురించి ఉన్న అపోహాలను తొలగించారు. అవగాహన పెంచడానికి విద్యా సంబంధిత ఉచిత సమూనాల పంపిణి చేపట్టారు. ఈ వ్యాధి బారిన పడిన వారిని సమాజం అంగీకరించేలాప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అపోహలను తొలగించడానికి, వివక్షను, ఎదిరించడానికి, రోగులలోవాస్తవాలతో కూడిన ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ప్లకార్డులతో కూడిన అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డివిఎల్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్లు మధుబాబు, అరుణ, అసిస్టెంటు ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, ,హౌస్‌సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాల ప్రభావంతో పత్రికల మనుగడ కష్టం

పురస్కారాలను ప్రధానం చేస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి

చిక్కడపల్లి జూన్ 25 (ప్రభాతవార్త) : సామాజిక మాధ్యమాల ప్రభావం పెరిగిపోవడంతో నేడు ప్రింట్ మీడియా, పత్రికల మనుగడ కష్టంగా మారిందని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి రమణాచారి రమణ అభిప్రాయపడ్డారు. గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ, కళా సుబ్బారావు కళావేదికపై సాహితీ కిరణం మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రముఖ రచయిత డాక్టర్ రామకృష్ణారావు అధ్యక్షత వహించారు. అంతకు ముందు పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా హాజరైన కెవి రమణాచారి మాట్లాడుతూ. ప్రస్తుత పోటీ ప్రపంచంలో, అందునా సామాజిక మాధ్యమాల ఉధృతి మధ్య ఒక పత్రికను సాహిత్యమే ప్రధానంగా 17 ఏళ్ల పాటు నిరంతరాయంగా నడపడం సామాన్యమైన విషయం కాదని ప్రశంసించారు. కేవలం పత్రిక నిర్వహణకే పరిమితం కాకుండా, సాహిత్య పోటీలు నిర్వహిస్తూ తెలుగు భాషా వికాసానికి "సాహితీ కిరణ్మ కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పింగళి జగన్నాథరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ రచయిత శ్రీరామమూర్తి, సిరిగది నరసయ్య స్మారక పురస్కారాన్ని కవి డాక్టర్ ప్రభాకర్, సిరిగది బాలమ్మ స్మారక పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి మాణికేశ్వరి లకు అందించారు. వంశీ గ్లోబల్ అవార్డ్స్ వ్యవస్థాపకులు వంశీ రామరాజు, పెద్దూరి వెంకటదాసు తదితరులు పాల్గొని ప్రసంగించారు. పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు హాజరైన వారందరికీ స్వాగతం పలికారు. సభలో పలువురు కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ ఓయూ పీజీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ శ్రీధర్.

పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అబిడ్స్ సిఐ పరుశురాం, ఈచిత్రంలో సిబ్బంది, తదితరులు

అవేరెనెస్ కార్యక్రమంలో పాల్గొన్న దోమలగూడ పోలీసులు

డ్రగ్స్‌రహిత సమాజమే మన లక్ష్యం

ఓయూ పీజీ కళాశాలలో

బేగంపేట జూన్ 25.ప్రభాతవార్త : డ్రగ్స్‌రహిత సమాజమే మన లక్ష్యం అని మల్కాజ్ గిరి డీసీపీ సీహెచ్ శ్రీధర్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ ఓయూ పీజీ కళాశాలలో విద్యార్థులకు అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ శ్రీధర్ మాట్లాడుతూ యువత శక్తి దేశానికి రక్ష, డ్రగ్స్‌కు దూరంగా ఉందాం. ఆరోగ్యకరమైన ఉజ్వలమైన భవిష్యత్‌ను నిర్మించుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్స్‌పెక్టర్ సైదులు, ఓయూ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కవితాదేవి. డిఐ శ్రీనివాస్, ఎస్సైలు శ్రావణ్‌కుమార్, షఫీ, శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాగ్దేవి పాఠశాలలో

మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వల్ల యువత ,కుటుంబాలు బలైపోతున్నాయని. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు పిలుపు నిచ్చారు. గురువారం బేగంపేట లోని వాగ్దేవి పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుమల గిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం విద్యార్థులు, యువతపై చెడు ప్రభావాన్ని చూపుతాయని, వాటికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ సైదులు, ఎస్సైలు శ్రావణ్ లాఅండ్ ఆర్డర్ పోలీసులు. వాగ్దేవి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి కళాశాలలో

కార్వాన్, జూన్25 (ప్రభాతవార్త) : మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోల్కొండ జోన్ పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పుల్లారెడ్డి ఫార్మసీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జోన్ అదనపు డీసీపీ కృష్ణ గౌడ్, ఏసీపీ కుల్సుంపురా తిరుపతి, కుల్సుంపురాఎస్‌హెచ్ఓ రామయ్య, డీఐ గురునాథ్, ఎస్సై చి.సురేష్ పాల్గొని విద్యార్థులతో పాటు అధ్యాపకులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు, అలాగే ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన జీవనశైలిని అవలంబించాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు.

సుజాత కళాశాలలో

గన్‌ఫౌండ్రి, జూన్ 25ప్రభాతవార్త: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, అంతే కాకుండా సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అబిడ్స్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం అన్నారు. ఈమేరకు గురువారం అబిడ్స్ పోలీసు ఆధ్వర్యంలో చిరాక్‌అలీలైన్‌లో ఉన్న సుజాత కళాశాలలో డ్రగ్స్ వద్దు-జీవితం ముద్దు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాలలోని విద్యార్థులు, అధ్యాపకులు, అబిడ్స్ పోలీసు సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు గురేందర్, తిరుమల్, శ్రీకాంత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమలగూడ పరిధిలో...

ముషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త: డ్రగ్స్ రహిత తెలంగాణ మన లక్ష్యమని దోమలగూడ సీఐ అంజద్ అలీ స్పష్టం చేశారు. గురవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు ఎలా నాశనం అవుతుందో తెలియచేస్తూ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతతో కలసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, డేవిడ్‌రాజ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వైష్ణవి జూనియర్ కళాశాలలో మాదద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సిఐ ముత్తు యాదవ్

వైష్ణవి జూనియర్ కళాశాలలో

అత్తాపూర్ జూన్ 25,ప్రభాతవార్త : విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని రాజేంద్రనగర్ సిఐ ముత్తు యాదవ్ పేర్కొన్నారు. గురువారం భవానీ కాలనీలోని వైష్ణవి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.

నటరాజ స్వామి ఆలయంలో 'ఆణి తిరుమంజన మహోత్సవం'

హైదరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త: చిదంబరంలోని చారిత్రాత్మక నటరాజ స్వామి దేవాలయంలో జరిగిన 10 రోజుల ఆణి తిరుమంజన మహోత్సవంలో తెలంగాణ కళాకారుల సాంస్కృతిక సమర్పణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన రెండు రోజుల ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణకు చెందిన 50 మందికి పైగా సంగీత విద్వాంసులు, నృత్య కళాకారులు, విద్యార్థులు, భక్తులు సంగీతం, నృత్యం, సాహిత్యం ద్వారా నటరాజ స్వామికి భక్తి నివేదన చేశారు. నటరాజ ఆలయ ధర్మకర్త, ప్రధాన అర్చకులు ఎన్.డి. నటరాజ దీక్షితార్ ఆశీస్సులు, మార్గదర్శకత్వంలో, ప్రముఖ మృదంగ విద్వాంసులు పద్మశ్రీ డా. యల్లా వెంకటేశ్వరరావు సమక్షంలో హైదరాబాద్‌కు చెందిన సాంస్కృతిక సేవకులు గోడి విజయతాదేవి, గోడి సతీష్ రెడ్డి ఈ సాంస్కృతిక బృందానికి నాయకత్వం వహించారు. ప్రఖ్యాత కూచిపూడి గురువు జ్యోతి రెడ్డి నేతృత్వంలోని జ్యోతి కళాక్షేత్రం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు భారతి పొలాకి నేతృత్వంలోని రాగ మ్యూజిక్ అకాడమీ ఈ కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నాయి. రాగ మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు పి. సూర్యనారాయణ రచించిన

రాష్ట్రం నుంచి నృత్య ప్రదర్శన చేసిన బృందం

భాసురి తెలుగు సంగీత గ్రంథం ఆవిష్కరణ కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మద్దెల పూజతో ఆధ్యాత్మిక ఆరంభంతెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలకు పద్మశ్రీ డా. యల్లా వెంకటేశ్వరరావు నిర్వహించిన సంప్రదాయ మద్దెల పూజ, శివతాండవంతో శ్రీకారం చుట్టారు. 83 ఏళ్ల వయస్సులోనూ ఆయన ప్రదర్శించిన లయ విన్యాసాలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా డా. యల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, "చిదంబరంలో మద్దెల పూజ చేయడం ప్రతి కళాకారుడికి లభించే గొప్ప దైవానుగ్రహం. సంగీతం ద్వారా నటరాజ స్వామిని సేవించే అవకాశం లభించడం నా అదృష్టం" అని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పేరిట నకిలీ పత్రాలు సృష్టికర్తల అరెస్టు

అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త: ఇందిరమ్మ ఇళ్ళ మంజూరికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి పేదలు నుంచి లక్షలు రూపాయలు దండుకున్న ముఠాను అల్వాల్ పోలీసులు కటకాలు వెనుకకు నెట్టారు. కేసుకు సంబంధించి మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ మీడియాకు వివరించారు. తిరిమలగిరి ప్రాంతానికి చెందిన జయ్‌రాజ్ ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన పనులు చేయడంలో దిట్టగా ఉన్నాడు. బ్రోకర్‌గా పరిచయస్తులు ద్వారా ప్రభుత్వ పనులు చేస్తూ వారి నమ్మకాన్ని కూడగట్టుకున్నాడు. కలెక్టరేట్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసిన పుష్పలత ఇతను జత కలిశారు. అల్వాల్‌లో రెండు పడక గదులు ఇల్లు ఇప్పిస్తామని ప్రజలను నమ్మిస్తూ వచ్చారు. పలు దఫాలుగా 50 వేలు నుంచి లక్ష రూపాయలు వరకు వసూలు చేశారు. 2023 నుంచి ఈ వ్యవహారాన్ని వీరు నడిపారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇల్లు రాక పోవడంతో బాధితులు వీరిపై ఒత్తిడి తెచ్చారు. నకిలీ పత్రాలను సృష్టించాలని ఇరువురు నిర్ణయించుకున్నారు. రెండు గదులు ఇళ్ళు మంజూరుకు సంబంధించిన 79 నకిలీ పత్రాలను పేదలకు అందచేశారు. సొంతింటి కల నెరవేరిందనే గంపడాశతో వారు ఉన్నారు. మంజూరు పత్రాలు అయితే ఉన్నాయి కాని ప్రభుత్వ సిబ్బంది నుంచి ఎటువంటి సమాచారం వీరికి అందక పోవడంతో అనుమానం వచ్చింది. కలెక్టరేట్ ఇతర కార్యాలయాలకు తమకు ఇచ్చిన నకిలీ పత్రాలను తీసుకుని విచారణ జరపగా మోస పోయామని గుర్తించారు. బాధితులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మొత్తం బండారం బయట పడింది. 99 మంది నుంచి వీరు డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నకిలీ సర్టిఫికేట్లును రాధా స్వామి జిరాక్స్ సెంటర్ యజమాని మహేందర్ సింగ్ సృష్టించగా రబ్బర్ స్టాంపులను రాణిగంజ్‌లోని రాజ్ అండ్ కో వద్ద చేయించారు. నిందితులకు సహకరించిన మరో నలుగురు పరారీలో ఉన్నారు. పుష్పలత, గోపీనాథ్, మహేందర్ సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించనట్లు డిసిపి తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్రోకర్లును నమ్మి మోస పోవద్దని డిసిపి కోరారు.

మీడియా సమావేశంలో డిసిపి శ్రీధర్

బిజెపి విధానాలతో యువత భవిష్యత్ ఆందోళనకరం

ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ చైర్మన్ డా. విక్రాంత్ భూరియా

ఛత్రూంకీ గూంజ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విక్రాంత్ భూరియా, మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ తదితరులు

హైదరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త: ఆల్‌ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఛాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమం గురువారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ఆదివాసి కాంగ్రెస్ నేషనల్ చైర్మన్ డా. విక్రాంత్ భూరియా, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్, ప్రభుత్వ విప్, డాక్టర్ బల్మూర్ వెంకట్, నీట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఛత్రూంకీ గూంజ్ పోస్టర్లు, కర పత్రాలను విడుదల చేశారు. ఆదివాసి కాంగ్రెస్ జాతీయ చైర్మన్ డా. విక్రాంత్ భూరియా మాట్లాడుతూ...దేశంలో విద్యార్థులు, యువత మరియు విద్యా రంగానికి సంబంధించిన కీలక అంశాలపై మాట్లాడారు. పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలతో విద్యార్థులను మోసం చేయడం, నిరుద్యోగులను మోసం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వారికి అండగా లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువతతో గొంతు కలిపి పోరాటానికి శ్రీకారం చుట్టారని అందులో భాగంగానే దేశంలో ప్రధాన నగరాల్లో చాంత్రోకి గూంజ్ పేరుతో ఆందోళన కార్యక్రమాలకు పిలుపునివ్వగా మీరంతా భాగస్వామ్యులై మీ గొంతను వినిపించాలన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండాగా విద్యార్థుల సమస్యలు, సూచనలు, అనుభవాలను నేరుగా తెలుసుకునేందుకు రాహుల్ గాంధీ విద్యార్థులు, నిరుద్యోగులను ప్రత్యక్షంగా కలుస్తున్నారన్నారు. ఈసందర్భంగా డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ..."ఛాత్రోం కీ గూంజ్" రాజకీయ కార్యక్రమం కాదనీ, దేశ యువత భవిష్యత్తు కోసం ప్రారంభమైన జాతీయ ఉద్యమనీ చెప్పారు. విద్యార్థి, యువత కలలను సాకారం చేస్తేనే భారత్ ప్రపంచ శక్తిగా ఎదుగుతుందని విశ్వసిస్తున్న కాంగ్రెస్ పార్టీ, దేశ యువతకు విద్య, ఉపాధి, సమాన అవకాశాలు అందించేందుకు నిత్యం పోరాడుతుందన్నారు. విద్య వ్యవస్థలో సంస్కరణలు చేపట్టడమే కాకుండా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే వరకూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీతో అన్ని వర్గాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ షాక్‌తో కూలీ మృతి

పేట్ బషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త

మేడ్చల్ మండల పరిధిలోని కండ్లకోయ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ శాఖ నిర్వహణ పనుల్లో పాల్గొంటున్న ఓ కూలీ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన ఈ నెల 24వ తేదీ సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్లకోయ ప్రాంతంలోని సాయి గీత ఆశ్రమం సమీపంలో 33 కేవీ విద్యుత్ లైన్ కింద విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వహణ పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా కూలీగా పనిచేస్తున్న కొర్ర జగ్రాం (46) చెట్టుపైకి ఎక్కి విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో చెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొర్ర జగ్రాం సైదాబాద్‌లోని సింగరేణి కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అతనికి భార్య మంగ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. జగ్రాం మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యంత్రం కిందపడి యువకుడు మృతి

పేట్ బషీరాబాద్, జూన్ 25, ప్రభాతవార్త

సుభాష్ నగర్‌లో ఉన్న ఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ వద్ద యంత్రాలను దింపుతున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 24వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అరవింద్ సాయి (26), వంశీ, ప్రకాష్ అనే ముగ్గురు వ్యక్తులు సుభాష్ నగర్‌లోని ఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ వద్దకు కొత్తగా వచ్చిన ప్యానెల్ బోర్డు ఉత్పత్తి యంత్రాలను పరిశీలించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో యంత్రాలను క్రేన్ సహాయంతో దింపుతున్న సమయంలో రెండు యంత్రాలను సురక్షితంగా దించగా, మూడవ యంత్రాన్ని దించుతున్న సమయంలో క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా యంత్రం అదుపు తప్పి అరవింద్ సాయిపై పడింది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే సుచిత్రలోని రష్ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో శివం తిరుపతి రెడ్డి, లింగాల పవన్ కుమార్‌లకు ఎడమ చేతికి గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. క్రేన్ డ్రైవర్ దీపక్‌తో పాటు ఎస్ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్ యజమానులు సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ మేరకు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

జీడిమెట్ల, జూన్ 25, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ పరిధిలోని కైసర్ నగర్‌లో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. స్థానిక మున్సిపల్ ఉప కమిషనర్ వెంకట రాములుతో కలిసి ఆయన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహణ తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియను బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సేకరించి, ఓటరు జాబితాలో ఎవరూ మిగలకుండా నమోదు చేసేలా కృషి చేయాలని అన్నారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అన్ని వివరాలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని అధికారులకు సూచించారుప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, అధికారులు, బీఎల్ఓలు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించ

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే మర్రి

ఇందిర్మ చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త: సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని ప్రజలు సహకరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేయడంతో పాటుగా ఇందిరమ్మ చీరలు పంపిణీ, వన మహోత్సవం తదితర కార్యక్రమాలులో పాల్గొన్నారు. లోతుకుంట లక్ష్మీనగర్‌లో 54లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పనులకు స్థానిక మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి శంఖుస్థాపన చేశారు. రెడ్డి ఎన్‌క్లేవ్ వద్ద జరిగిన వన మహోత్సవంలో ఎమ్మెల్యే పార్కులో మొక్కలు నాటడడంతో పాటుగా స్థానికులకు పంపిణీ చేశారు. ఇందిరానగర్‌లోని మహిళా భవనం వద్ద స్థానిక మాజీ కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి మర్రి రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ చీరలు మహళలకు అందించడం జరిగింది. ఆయా కార్యక్రమాలులో సర్కిల్ డిసి భోగేశ్వర్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, శ్రీధర్ గౌడ్ ఇతరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మహిళా శక్తి చీరెల పంపిణీ

ఇందిరా మహిళా శక్తి చీరెలను మహిళలకు పంపిణీ చేస్తున్న గౌరపల్లి రమేష్.

బేగంపేట జూన్ 25,ప్రభాతవార్త

ఇందిరమ్మ మహిళా శక్తి చీరెల పంపిణీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు అందిస్తున్న కానుక అని ప్రకాశంనగర్ డివిజన్ నాయకుడు గౌరపల్లి రమేష్ అన్నారు. గురువారం బేగంపేట అల్లంతోట బాయిలో ఇందిరా మహిళా శక్తి చీరెల పంపిణీ కార్యక్రమాన్ని రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజాప్రభుత్వం మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు. నాయకులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే శ్రీగణేష్

మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

అడ్డగుట్ట,జూన్ 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లి షెనాయ్‌ప్లేగ్రౌండ్‌లో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఏర్పాటు చేసిన చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న చీరలలో ఎంతో నాణ్యత ఉందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యత లేని చీరలను పంపిణీ చేయడంతో వాటిని ఎవరు ఉపయోగించుకోలేదన్నారు. 553 బస్సులను మహిళలకు ఆర్టీసీకి అద్దె ఇప్పించిందన్నారు. మహిళా సంఘాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి వడ్డీలేని రుణం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూసిడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్ రావ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు చిర్రబోయిన వైష్ణవి యాదవ్, సంతోష్ యాదవ్,బద్రి యాదవ్, నందికంటి రవి, రేపాల వెంకటేశ్వర్లు,ప్రభాకర్ యాదవ్, నాగేశ్ యాదవ్, నర్సింహ్మ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలకం

విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చాంద్రాయణగుట్ట, జూన్ 25, ప్రభాతవార్త : మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని ఛత్రినాక ఏసీపీ సిహెచ్.చంద్రశేఖర్ సూచించారు. ఉప్పుగూడ తానాజీనగర్‌లోని శ్రీ సరస్వతి శిశు విద్యా మందిరంలో విద్యార్థులకు 'డ్రగ్స్‌కు నో చెప్పండి' అన్న అంశంపై బ్యాన్లు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ చంద్రశేఖర్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటి ప్రభావం ఆరోగ్యం, విద్య, కుటుంబం, సమాజంపై ఎలా ఉంటుందో వివరించారు. డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చదువు, క్రీడలు, క్రమశిక్షణ, సానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు. తమ పరిసరాల్లో ఎలాంటి మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.నాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, స్టేషన్, పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు

సిసి రోడ్డు పనులు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

రోడ్డు పనులు ప్రారంభోత్సవంలో జితేందర్‌నాథ్

అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త: మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని మంగాపురం కాలనీలో 25లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులు మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. డివిజన్ సమగ్రాభివృద్ధిలో బాగంగా ప్రజా అవసరాలు మేరకు సమస్యలు పరిష్కరించామని జితేందర్ నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, వెంకటేష్ గౌడ్, దేవ, దిడ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం నగర్‌లో రోడ్డు ఆక్రమణలు తొలగింపు...

-రోడ్డు,ఫుట్‌ఫాత్‌లు ఆక్రమించి ఇబ్బందులు కల్గిస్తే కఠిన చర్యలు

-తిరుమలగిరి ట్రాఫిక్ ఎసిపి శంకరరాజు

బేగంపేట జూన్ 25,ప్రభాతవార్త

బేగంపేట ప్రకాశం నగర్‌లో రోడ్డు,ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణలను తిరుమల గిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. ప్రకాశం నగర్ ప్రధాన రోడ్డును ఆక్రమిస్తూ కొందరు దుకాణదారులు బయటకు బండ్లను ఏర్పాటు చేయడం, మరి కొందరు రోడ్లను ఆక్రమిస్తూ ఇనుక వేయడం, ఇంకొందరు రోడ్డును మూసివేస్తూ ద్విచక్రవాహనాలను రెండు రోడ్లపై బ్లాక్ చేయడం పై స్థానికులు ట్రాఫిక్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. మరికొందరు సోషల్ మీడియాలో పోస్టులు చేసారు. రోడ్డు ఆక్రమణలు చేసి వాహన దారులకు ఇబ్బందులు సృష్టిస్తున్న ఆక్రమణలను తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు తన సిబ్బందితో కల్సి వచ్చి ఆక్రమణలను తొలగించారు. ప్రకాశం నగర్ బస్టాప్‌కు రెండు వైపులా ఉన్న రోడ్లలో ఉన్న రోడ్డు ఆక్రమణలను వారు తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు మాట్లాడుతూ రోడ్లను,ఫుట్‌ఫాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బేగంపేట లోని మిగిలిన ప్రాంతాల్లోని ఫుట్‌ఫాత్,రోడ్డు ఆక్రమణలను త్వరలోనే తొలగిస్తామని,ప్రధాన రోడ్డుపై కూడా కొందరు చిరు వ్యాపారులు రోడ్లపైన వివిధ రకాలైన బండ్లు పెట్టడంతో వాహనదారులు అక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చిన సమయాల్లో తీవ్రమైన ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుందని,దీన్నిదృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా అన్ని ప్రాంతాల్లోని రోడ్లు,ఫుట్‌ఫాత్‌ల ఆక్రమణలను తొలగిస్తామని ఏసీపీ శంకరరాజు హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపులో ట్రాఫిక్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ

దుండిగల్, జూన్ 25, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ మల్లంపేట్‌లో శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థాన రాజగోపురం నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి సంబంధించిన పనులు విజయవంతంగా ముందుకు సాగాలని స్వామివారిని ప్రార్థించిన శంభీపూర్ క్రిష్ణ, దేవాలయ రాజగోపురం నిర్మాణం భక్తుల ఆకాంక్షలను నెరవేర్చే గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు. ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అలాగే ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, స్థానికులు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి దేవస్థానం అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. రాజగోపురం నిర్మాణం ద్వారా ఆలయానికి ప్రత్యేక శోభ చేకూరుతుందని, భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించే దిశగా

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ

కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు మాదాస్ వెంకటేష్, షామీర్పేట్ హనుమంతరావు, ఎంబరి ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, బండారి మహేందర్, సీనియర్ నాయకులు కొల్తూరు మల్లేష్ ముదిరాజ్, మాదాస్ నర్సింగరావు, కుంట్ల నందు, మాదాస్ నవీన్, షామీర్పేట్ ప్రకాష్, శ్రీనివాస్ గుప్తా, కుమ్మరి ప్రశాంత్, దుశకంటి కుమార్, సబితా జలందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, శివకాంత్, మాదాస్ ఆదిత్య, వంశీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : అడిషనల్ డిసిపి కె.ఎస్.రావ్

కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలలో అవగాహన సదస్సులో పాల్గొన్న అదనపు డిసిపి కె.ఎస్.రావు, చైర్మన్ నరోత్తం రెడ్డి, ప్రిన్సిపాల్ రాజశ్రీ,జయసుధ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 25 ప్రభాతవార్త: యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజేంద్ర నగర్ టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి కె.శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. గురువారం సికింద్రాబాద్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రీ,పిజి కళాశాల ఆవరణలో ఎన్.సీసీ.అధికారి మేజర్ జయసుధా ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్,సైబర్ క్రైం, ఆన్‌లైన్ గేమ్ అంశాలపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మాదకద్రవ్యాల వినియోగం,వ్యక్తిగత జీవితంలో కటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సైబర్ నేరగాళ్లు వివిధ మార్గల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడడం పట్ల చదువులు, మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పి.నరోత్తం రెడ్డి, కార్యదర్శి మహ్మద్ పహిముద్దీన్ ,ప్రిన్సిపాల్ ఆర్.రాజశ్రీ,ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ జయసుధా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సర్వేలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అడ్డగుట్టలో ఎస్.ఐ.ఆర్.సర్వేను ప్రారంభిస్తున్న మెట్టుగూడ డిసి జ్యోతి,తహశీల్దార్ అనదుల్లాఖాన్,మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్న

అడ్డగుట్ట,జూన్ 25 ప్రభాతవార్త:

ఎన్నికల కమీషన్ నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్.పై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి తమ పేర్లను నమోదు చేసుకోవాలని అడ్డగుట్ట డివిజన్ మాజీ కార్పోరేటర్ లింగాని ప్రసన్న, మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లాఖాన్,మెట్టుగూడ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ ఎం.ఎన్.ఆర్.జ్యోతిలు పిలుపునిచ్చారు. గురువారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెన్సివ్ విజన్ (ఎస్.ఐ.ఆర్)ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు తప్పని సరిగా ఓటర్ల జాబితాలో మ్యాపింగ్ చేయించుకోవాలన్నారు. బి.ఎల్.ఏ.లు.తమ ఇంటికి వచ్చినప్పుడు ఎస్.ఆర్.పై పలు సలహాలు,సూచనలు ఇచ్చి వారికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్టకు చెందిన నాయకులు లింగాని శ్రీనివాస్,నక్క మధు,సత్తయ్య గౌడ్,మహ్మద్, నరేష్, నర్సింగ్,శంకర్, రాజు, సుజాత, భాగ్య, విమల, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ గ్రూపుకు ఐటీఏటీ నుంచి భారీ ఉపశమనం

జూబ్లీహిల్స్, జూన్ 25, ప్రభాతవార్త: వాసవీ గ్రూపుకు చెందిన మొత్తం 42 అప్పీళ్లను ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ) అనుమతిస్తూ కీలక తీర్పు ఇచ్చిందని సంస్థ సీఎండీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నిర్ణయంతో ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 271డీఏ కింద విధించిన రూ.215 కోట్లకు పైగా జరిమానాలను ట్రిబ్యునల్ రద్దు చేసినట్లు వెల్లడించారు. సెక్షన్ 269 ఎస్టీ ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో వాసవీ గ్రూపుపై జరిగిన సోదాలు, జప్తులు, తదనంతర చర్యల అనంతరం ఈ జరిమానా ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. ఉభయ పక్షాల వాదనలు, రికార్డులోని ఆధారాలను పరిశీలించిన అనంతరం ఐటీఏటీ ఈ అప్పీళ్లను అనుమతించినట్లు చెప్పారు. ఆదాయపు పన్ను సోదాల సమయంలో వాసవీ గ్రూపు తమ కస్టమర్ల నుంచి నగదు రూపంలో వసూళ్లు స్వీకరించి, వాటికి సంబంధించిన పన్నులను చెల్లించినప్పటికీ, రూ.2 లక్షలకు మించిన నగదు స్వీకరణపై ఆదాయపు పన్ను శాఖ సెక్షన్ 271 డీఏ కింద జరిమానాలు విధించిందన్నారు. అయితే, ఈ కేసును విచారించిన ఐటీఏటీ హైదరాబాద్ బెంచ్ ఆ జరిమానాలు సమర్థనీయం కావని స్పష్టం చేస్తూ వాటిని రద్దు చేసినట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

కేశవగిరి చెన్నకేశవస్వామికి వెండి రూపుకవచం

స్వామివార్ల వెండి తొడుగును అందజేస్తున్న ప్రదీప్‌కుమార్ రమ్య దంపతులు

చాంద్రాయణగుట్ట, జూన్ 25, ప్రభాతవార్త :

పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానానికి ఒడిస్సా రాష్ట్రానికి చెందిన భక్తుడు స్వామి వార్లకు వెండి తొడుగు (రూపుకవచం)ను సమర్పించుకున్నారు. ఎంతో పవిత్రమైన నిర్జల ఏకాదశి, గురువారాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యుల పర్యవేక్షణలో అర్చకస్వామి కంజర్ల ప్రణయ్ కుమారాచార్యులు చెన్నకేశవస్వామికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఒడిస్సా రాష్ట్రం బెరంహపూర్‌కు చెందిన ప్రదీప్ కుమార్ చౌదరి రమ్య దంపతులు వెండితో తయ్యారు చేసిన చెన్నకేశవ స్వామి రూపు కవచాన్ని అందజేశారు. కవచానికి శాస్త్రోక్త పూజలు జరిపిన అర్చకులు మూలవరులైన స్వయంభుః చెన్నకేశవస్వామికి అలంకరించారు. వెండి రూపుకవచంలో స్వామివార్లు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రతినిధులు, బస్తీవాసులు స్వామిని నూతన రూపంలో దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు ప్రతాపాచార్యులు ప్రదీప్ కుమార్ చౌదరి దంపతులను శాలువతో సన్మానించి తీర్థ ప్రసాదాలను, ఆలయ ఈవో శివరుద్రప్ప రశీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు జుర్కి రాజేందర్ కుమార్, ఎ.మహేష్ గౌడ్, మాజీ సభ్యులు రవి రాహుల్, కె.శైలేష్, బస్తీవాసులు బి.వెంకటేష్ ముదిరాజ్, ఎం.ప్రభాకర్‌రాజ్ ముదిరాజ్, కె.రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో ఉచిత డ్రోన్ వర్క్‌షాప్‌కు ఏర్పాట్లు

నిజాంపేట్, జూన్ 25, ప్రభాతవార్త

భవిష్యత్తు సాంకేతికతపై పిల్లలు, యువతలో ఆసక్తి పెంపొందించేందుకు డ్రోబాయ్స్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిజాంపేట్‌లో ఉచిత డ్రోన్ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు నిజాంపేట్ రోడ్ నంబర్-7లోని లైబ్రరీలో జరగనుంది. డ్రోబాయ్స్ ఎడ్యుకేషన్ వ్యవస్థాపకుడు పవన్ తెలిపిన వివరాల ప్రకారం, డ్రోన్‌లు ఎలా పనిచేస్తాయి, ఎలా ఎగురుతాయి, భవిష్యత్తులో డ్రోన్ టెక్నాలజీకి ఉన్న అవకాశాలు ఏమిటి వంటి అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు, యువతతో పాటు టెక్నాలజీపై ఆసక్తి ఉన్న వారందరికీ ఇది ఉపయోగపడేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. వర్క్‌షాప్‌లో భాగంగా ప్రత్యక్ష డ్రోన్ ఫ్లయింగ్ ప్రదర్శనలు, డ్రోన్‌ల నిర్మాణం, పనితీరుపై వివరణ, రోబోటిక్స్, ఏవియేషన్ రంగాలపై పరిచయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పిల్లలు, పెద్దల కోసం ఇంటరాక్టివ్ లెర్నింగ్ సెషన్లు, భవిష్యత్ కెరీర్ అవకాశాలపై చర్చ కూడా ఉండనుంది. పిల్లల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సైన్స్-టెక్నాలజీపై ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, టెక్నాలజీపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9390343861 నంబర్‌ను సంప్రదించవచ్చని, అలాగే డ్రోబాయ్స్ వెబ్‌సైట్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చని నిర్వాహకులు తెలిపారు.

సహోద్యోగిపై లైంగిక దాడి... కేసు నమోదు

జూబ్లీహిల్స్, జూన్ 25, ప్రభాతవార్త:

బంజారాహిల్స్‌కు చెందిన ఓ యువతి తన సహోద్యోగి లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిబ్రవరి 19న యువతి(26) పుట్టినరోజు వేడుకల సందర్భంగా సహోద్యోగులు అభినయ్, వంశీని ఇంటికి ఆహ్వానించగా, మద్యం సేవించిన అనంతరం నిద్రలో ఉండగా అభినయ్ యువతి అనుమతి లేకుండా లైంగికంగా దాడి చేశాడు. దీనికితోడు అభినయ్ పలుమార్లు శారీరకంగా యువతిని వేధించాడు. జూన్ 21న మరోసారి యువతి నివాసానికి వెళ్లిన అభినయ్, యువతి తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉండగా ఓదార్చినట్లు నటించి మద్యం మత్తులో ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకుని లైంగిక దాడికి పాల్పడ్డాడు. జూన్ 22, 23 తేదీల్లో తననుకలవాలని పదేపదే ఫోన్ కాల్స్, సందేశాల ద్వారా యువతిపై ఒత్తిడి చేశాడు. జూన్ 23న అభినయ్, వంశీ యువతి నివాసానికి వెళ్లి తలుపులు తీయకపోవడంతో ఫ్లాట్ బాల్కనీ మార్గంగా గదిలోకి ప్రవేశించారు. ఈ సంఘటనపై యువతి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లంపేట్, గాగిల్లాపూర్‌లో డిప్యూటీ కమిషనర్ విస్తృత పర్యటన

దుండిగల్, జూన్ 25, ప్రభాతవార్త : మల్లంపేట్, గాగిల్లాపూర్ ప్రాంతాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ గురువారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వ సమస్య, ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న వాష్‌రూమ్‌ల పనులు, గాగిల్లాపూర్‌లోని వెంచర్‌కు అవసరమైన మౌలిక వసతులపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. మల్లంపేట్‌లోని డ్రీమ్ వ్యాలీ రోడ్ నంబర్1లో వర్షాకాలంలో నీరు నిలిచే లోతట్టు ప్రాంతాలను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. స్థానిక ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను స్వీకరించి, రాబోయే వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాటర్ లాగింగ్ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు అసిస్టెంట్ ఇంజనీర్ (మెయింటినెన్స్) బి. సురేందర్ నాయక్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డిలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిశీలనలో డ్రీమ్ వ్యాలీ కాలనీ ప్రముఖులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మల్లంపేట్ ప్రభుత్వ హైస్కూల్‌లో కొత్తగా నిర్మాణం చేపడుతున్న వాష్‌రూమ్‌ల పనులను డిప్యూటీ కమిషనర్ నిశితంగా పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, విద్యార్థులకు ఉపయోగపడేలా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ

స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్

కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు. ఇక గాగిల్లాపూర్‌లోని దీప్తి సువర్ణ సంపద వెంచర్స్ నిర్వాహకులు తమ వెంచర్‌కు రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు, క్లీనింగ్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన డాక్టర్ వెంకట మణికరణ్, వెంచర్‌ను స్వయంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. వెంచర్‌లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి సమగ్ర నివేదికతో పాటు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్‌లను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించి, సమస్యలను నేరుగా పరిశీలిస్తూ తక్షణ చర్యలకు ఆదేశాలు ఇవ్వడం ద్వారా డిప్యూటీ కమిషనర్ స్పందన స్థానికుల్లో విశ్వాసాన్ని పెంచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

టిఆర్ఎస్ పార్టీలో చేరిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

సైబరాబాద్ ప్రతినిధి, జూన్25 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా ఉపాధ్యక్షులు వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సుమారు 250 మంది బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి పెద్దఎత్తున తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయానికి భారీగా తరలివెళ్లారు. ఆ పార్టీ అద్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ రక్షణ సేన పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీని వీడి టీఆర్ఎస్‌లో చేరిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, ఆయన సతిమణి నివేదిత,రఘురాం,రవికృష్ణతో పాటు పార్టీలో చేరిన వారిని తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన అద్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వాని ంచారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి నియోజక వర్గంలో ఇప్పటి వరకు బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమ సమయంలో వెన్నంటి ఉంటూ అహర్నిశలు పార్టీ అభ్యున్నతికోసం కష్టపడి పనిచేసిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆయన సతీమణి నివేదిత ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో

టీఆర్ఎస్ అధినేత కవిత ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్,కార్యకర్తలు

చేరటం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు. పార్టీలో చ

భక్తిశ్రద్ధలతో శ్రీవెంకటేశ్వరస్వామివారి వ్రతం

బ్రహ్మోత్సవంలో పాల్గొన్న చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు

ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త: శ్రీవెంకటేశ్వరస్వామివారి వ్రతంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొత్తపేట సౌభాగ్యపురం కాలనీలోని శ్రీఅలివేలుమంగా పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో జరుగుతున్న పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురువారం భక్తులతో సామూహిక శ్రీవేంకటేశ్వరస్వామివారి వ్రతం నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా కల్పవృక్ష వాహనోత్సవాన్ని, గజవాహనోత్సవాన్ని వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రతినిధులు వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సబ్యులు వెంకట్‌రెడ్డి, మూర్తి, నరసింహరెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, అనిల్, రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామారావు, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, కృష్ణమోహన్, విద్యాసాగర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి

తుర్కయంజాల్ జూన్25(ప్రభాతవార్త)

తుర్కయంజాల్ గ్రామ ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుర్కయంజాల్ భారతీయ జనతా రాష్ట్ర నాయకులు బచ్చు గల రమేష్ పేర్కొన్నారు. గురువారం బీజేపీ జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ల ఉపాధ్యక్షుడు గుండ కృష్ణ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు బచ్చి గళ్ళ రమేష్ మాట్లాడుతూ తుర్కయంజాల్ ప్రధాన రహదారిపై డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. ముఖ్యంగా సమీపంలోని పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపార సముదాయాలకు వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి సమస్యపై సానుకూలంగా స్పందించారు. డ్రైనేజీ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. త్వరలోనే అవసరమైన చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మాజీ అధ్యక్షుడు తూళ్ల నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి నందగిరి సురేష్ గౌడ్, నిట్టు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి

మలక్ పేట్‌లో వాహనదారులను తనిఖీలు చేస్తున్న చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

మలక్ పేట, జూన్ 25, ప్రభాతవార్త: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి పేర్కొన్నారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఎస్ఐ లు, పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలను నిర్వహించి హోటల్లు, పాన్ షాప్స్, వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వదంతులు, పుకార్లు నమ్మవద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందస్తు తనిఖీలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. నిరంతరం ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఐ లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు

ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త: ఎస్ఐఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమం అమలుకు సంబంధించి సరూర్‌నగర్ సర్కిల్ డిసి శ్రీకాంత్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ ప్రభాత్‌నగర్‌కాలనీలోని ఎలిమినేటి మాధవరెడ్డి కమ్యూనిటీహాల్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, ప్రజలకు అవగాహన కల్పించడం, కార్యక్రమం అమలులో అనుసరించాల్సిన విధానాలపై వివరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం ప్రజలకు మరింత చేరువ కావాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో అవగాహన కల్పించడంలో తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్ రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, నర్సింహాగుప్తా, నాయికోటి పవన్, బీజేపీ, బిఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు లింగాల రాహుల్‌గౌడ్, తోట మహేష్ యాదవ్, దాసరి జయప్రకాష్, బత్తుల సుమన్‌గౌడ్, అనిల్, చంద్రశే ఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, త్రివేది, కృష్ణప్రకాష్, బీఎల్ఏలు, అధికారులు పాల్గొన్నారు.

మహా పూర్ణాహుతి, చక్రస్నానంతో ముగిసిన వినోబానగర్ బ్రహ్మోత్సవాలు

-గోవింద నామస్మరణలతో మారుమోగిన ఆలయ ప్రాంగణం..
-భారీగా తరలివచ్చిన భక్తజనం

నేరేడ్ మెట్ , జూన్ 25 ,ప్రభాతవార్త : మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని వినోబానగర్‌లో వెలసిన శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణం, 108 కలశాభిషేకం, చక్రస్నాన మహోత్సవాలతో వైభవోపేతంగా ముగిశాయి. వేదఘోషలు, గోవింద నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజైన గురువారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. నిత్య సేవాకాలం, ద్వారతోరణ, ధ్వజకుంభ ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం మూలమంత్ర హవనం, ఆదిత్యహృదయ సహిత మన్యుసూక్త హవనం, దుర్గాహోమం, గణపతి ఆరాధన, మూలమంత్ర హోమం వంటి విశిష్ట వైదిక కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించిన మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతులు సమర్పించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి అనంతరం కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి 108 పవిత్ర కలశాలతో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, చక్రస్నాన మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. చక్రస్నాన సమయంలో భక్తులు గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం నిత్య మంత్రపుష్పం, మహాబలిహరణ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం భక్తిశ్రద్ధలతో కొనసాగగా, శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు 108 స్వర్ణపుష్పార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హోమం, సాయంసంధ్యారాధన, దీపారాధన, మహామంగళహారతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల గోవింద నామ సంకీర్తనలతో ఆలయం భక్తిరసపూరితంగా మారింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ బ్రహ్మోత్సవాల్లో దేవస్థాన పాలక మండలి సభ్యులు, జీవితకాల సభ్యులు, భగవద్బంధువులు, మహిళా భక్తులు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి సేవలో భాగస్వాములయ్యారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది ప్రసాదాన్ని స్వీకరించి స్వామివారి అనుగ్రహానికి పాత్రులయ్యారు. బ్రహ్మోత్సవాల విజయవంతమైన నిర్వహణకు సహకరించిన దాతలు, సేవకులు, జీవితకాల సభ్యులు, భక్తులకు దేవస్థాన కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. స్వామివారి దివ్య కృప భక్తులందరిపై ఇలాగే ఉండాలని ఆకాంక్షిస్తూ చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల సమాప్తిని ప్రకటించింది.

మానసిక వికాస లోపాలున్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : సైకాలజిస్ట్ డాక్టర్ ఇఖ్రా అలీ

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ డాక్టర్ ఇఖ్రా అలీ

మలక్ పేట, జూన్ 25, ప్రభాతవార్త: చిన్నారుల్లో పెరుగుతున్న మానసిక, ప్రవర్తనా సమస్యలను తల్లిదండ్రులు నిరక్ష్యం చేయకుండా వెంటనే నిపుణులను సంప్రదించాలని ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ ఇఖ్రా అలీ సూచించారు. మలక్‌పేట్‌లోని డాన్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల కోసం గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇఖ్రా అలీ మాట్లాడుతూ, పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచడమే కాకుండా తల్లిదండ్రులు కూడా వాటి వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ, వారి భావోద్వేగాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని చెప్పారు. ప్రేమ, ఆప్యాయతలతో కూడిన స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించడం ద్వారా పిల్లల్లో ఉన్న భయం, సంకోచం, మానసిక ఒత్తిడిని తగ్గించవచ్చని వివరించారు. ఆటిజం అనేది మెదడు, నాడీ వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేసే పరిస్థితి అని వివరించారు. ఆటిజంతో బాధపడే పిల్లలకు సామాజిక సంబంధాలు, సంభాషణ, ఇతరుల భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, తమ భావాలను వ్యక్తపరచడంలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ (ఏఎస్‌డీ)గా పిలుస్తారని ఆమె పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో పిల్లల్లో మానసిక సమస్యలు వేగంగా పెరుగుతున్నాయని, అలాంటి పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం అత్యంత ముఖ్యమని చెప్పారు. పిల్లల ప్రవర్తనలో అసాధారణ మార్పులు గమనించిన వెంటనే తల్లిదండ్రులు మానసిక వైద్యులను సంప్రదించి సరైన చికిత్స అందించాలని సూచించారు. డాన్ హైస్కూల్ డైరెక్టర్ ఫజ్లుర్ రెహ్మాన్ ఖుర్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యూస్ బ్రాడ్‌కాస్టర్ షజిఉల్లా ఫిరాసత్, ప్రముఖ కాలిగ్రాఫర్ ఘౌస్ అర్సలాన్, మహ్మద్ హిసాముద్దీన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : సిద్దాల లార్డ్స్ బీరప్ప

జిల్లెలగూడ డివిజన్‌లో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్, సిద్దాల లార్డ్స్ బీరప్ప

సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాత మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ వార్డు మాజీ కార్పొరేటర్ సిద్దాల లార్డ్స్ బీరప్ప పిలుపునిచ్చారు. పునర్విభజన జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో విలీనమైన మీర్‌పేట్ కార్పొరేషన్‌లో కొత్తగా ఏర్పడిన జిల్లెలగూడ డివిజన్-59లో గురువారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్, లార్డ్స్ గ్రూపు విద్యా సంస్థల చైర్మన్ సిద్దాల లార్డ్స్ బీరప్ప స్థానిక నాయకులతో కలిసి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబన, సాధికారికతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని వెల్లడించారు. జిల్లెలగూడ డివిజన్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలను ఆయన అభినందించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇలాంటి సంక్షేమ సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ యాదవ్, శరణ్ బసప్ప, మాచర్ల అవినాశ్, సిద్దాల భరత్, శ్రీనివాస్ యాదవ్, పలువురు కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ళతో పాటు రిసోర్స్ పర్సన్ గీత తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్‌గా చైతన్యరెడ్డి

టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను సన్మానిస్తున్న మద్ది చైతన్యరెడ్డి

సైదాబాద్, జూన్ 25 ప్రభాతవార్త: యూత్ కాంగ్రెస్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా కర్మన్‌ఘాట్‌కు చెందిన మద్ది చైతన్యరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఇండియన్ యూత్ కాంగ్రెస్ మీడియా నేషనల్ చైర్మన్ వరణ్ పాండే ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైతన్యరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, యూత్ కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. కాగా యూత్ కాంగ్రెస్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా నియమితులైన మద్ది చైతన్యరెడ్డి గురువారం టిపిసిసి ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.

తల్లిదండ్రుల మందలింపుతో యువతి అదృశ్యం

నేరేడ్ మెట్ జూన్ 25 ,ప్రభాతవార్త : తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైన ఘటన నేరేడ్మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జీకే కాలనీకి చెందిన కొమ్మరాజుల ఇందు (22) ఈ నెల 22న మధ్యాహ్నం సుమారు 12.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో తల్లి కొమ్మరాజుల సువర్ణ నేరేడ్మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి, యువతి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

భార్యతో గొడవ.. ఇంటి నుంచి వెళ్లిన భర్త అదృశ్యం

నేరేడ్‌మెట్ జూన్ 25,ప్రభాతవార్త : డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి వివాదం ఓ యువకుడి అదృశ్యానికి దారితీసింది. నేరేడ్మెట్ పోలీసుల కథనం ప్రకారం, శ్రీకృష్ణనగర్‌కు చెందిన రమ్య (25) తన భర్త తరుణ్ (26), వృత్తిరీత్యా మేస్త్రీతో కలిసి నివాసం ఉంటోంది. ఈ నెల 20న రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో దంపతుల మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలో కూడా తరుణ్ ఇలాంటి సందర్భాల్లో ఇంటి నుంచి వెళ్లి కొద్ది రోజుల అనంతరం తిరిగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఈసారి నాలుగు రోజులు గడిచినా అతడు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య రమ్య నేరేడ్మెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు అదృశ్యమైన తరుణ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు: ఆకిటి ఆగంరెడ్డి

బీరప్పగడ్డలో ఓటరు ఫారాల పంపిణీ పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఆకిటి ఆగంరెడ్డి, సి.రఘుపతిరెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 25 ప్రభాతవార్త : ఓటు ప్రజల ఆయుధమని, క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ శ్రేణులు సర్ ప్రక్రియను క్షుణంగా పరిశీలించాలని పరిశీలించాలని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ ఇంచార్జీ ఆకిటి ఆగంరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం చిలుకానగర్‌లో ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పలు ప్రాంతాల్లో పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా మనమంతా బాధ్యతగా పనిచేద్దామని సూచించారు. ప్రతి బూత్ పరిధిలోని ఇళ్లను సందర్శించి, ఓటర్ల వివరాలను సరిచూడాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున కూడా జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటు నమోదు లేదా సవరణ ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

శ్రీహిల్స్ కాలనీలో కాంగ్రెస్ నేత సమస్యల పరిశీలన

సరూర్‌నగర్, జూన్ 25 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి బండంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్ డివిజన్ అల్కాస్‌గూడ శ్రీ హిల్స్ కాలనీలో గురువారం ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో కలిసి ఆయన పాదయాత్రలు చేస్తూ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగు నీటి సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయా సమస్యలను నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి కెఎల్ ఆర్, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ బహుగుణ నాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా అధ్యక్షులుగా మధుసూదన్ రెడ్డి

మధుసూదన్ రెడ్డిని సన్మానిస్తున్న వనిపల్లి, బిజెపి శ్రేణులు.

వనస్థలిపురం జూన్.25.ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా అర్బన్ కిసాన్ మోర్చా అధ్యక్షులు గా బి.ఎన్. రెడ్డి.నగర్ డివిజన్ కు చెందిన గుజ్జ మధుసూదన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనర్సయ్య నియామకపు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం తో అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా పదవి ఇచ్చినందుకు జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బి.జె.పి. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు,రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు బసవపురం లక్ష్మీనర్సయ్య, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని ఎన్.జి.ఓ.కాలనీలో గల రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యాలయంలో మధుసూదన్ రెడ్డి ని వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కళ్లెం రవీందర్ రెడ్డి,యష్పాల్ గౌడ్, నరేష్ యాదవ్,నాయిని నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి : సన్నీ యాదవ్

గడ్డి అన్నారం లోని అషూర్ ఖానాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సన్నీ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు

మలక్ పేట, జూన్ 25,ప్రభాతవార్త: ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని బిఆర్ఎస్ యువ నాయకులు సన్నీ యాదవ్ పేర్కొన్నారు. గడ్డిఅన్నారం లోని అషూర్ ఖానలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సన్నీ యాదవ్ విచ్చేసి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్, లింగాల శివకుమార్ గౌడ్, ఫెరోస్, అజ్మల్, అఫ్రోజ్, బిల్డర్ శివకుమార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయ నిధి: ఎమ్మెల్యే

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల తదితరులు

మలక్ పేట, జూన్ 25 , ప్రభాతవార్త: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తుందని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మలక్ పేట నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ముఖ్యమంత్రి సహాయనిది ఎంతగానో తోడ్పడుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పీ వి ఎన్ కాలనీ కమ్యూనిటీ హాల్ లో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా ఇందిర మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి అఖిల, పద్మా,భాగ్యలక్ష్మి, పుష్పలత, కల్పనా, మాదూరి,మాధవి,దనమ్మ,నాయకులు బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్ పాల్గొన్నారు

ఎస్ఐఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొన్న బత్తుల సుమన్‌గౌడ్

ఎల్.బి.నగర్, జూన్ 25 ప్రభాతవార్త: ఎస్ఐ